
చెప్పులు కుట్టే వ్యక్తి పాట




రాత్రి అంతా ధనవంతుడు తన డబ్బుల గురించి ఆందోళన పడుతూ ఉంటాడు. అతని ఇంటి కింద ఉండే చెప్పులు కుట్టే వ్యక్తి పాడే పాటల వల్ల ఆ ధనవంతుడికి పగలంతా నిద్ర పట్టదు.


కోపంతో ఆ ధనవంతుడు పన్నిన పన్నాగం వల్ల చెప్పులు కుట్టే వ్యక్తి తన పాటలను మరిచిపోయాడు. అయితే, ఒక రోజు అతని భార్య చెప్పిన మాటలతో అతను ఒక నిర్ణయానికి వచ్చాడు.

పారిస్‌లో ఇద్దరి వ్యక్తుల కథని మార్సియా సేవల్ అందంగా చెప్పారు.


చెప్పులు కుట్టే వ్యక్తి పాట



చాలా రోజుల నాటి సంగతి. పారిస్‌లో ఒక ఇంటిలోని నేల మాళిగ భాగంలో చెప్పులు కుట్టే ఒక పేద వ్యక్తి ఉంటున్నాడు. భార్యా, పిల్లలను పోషించటానికి అతడు పొద్దున్నే మొదలుపెట్టి రాత్రి చాలా పొద్దు పోయే వరకు పని చెయ్యవలసి వచ్చేది. చీకటిగా ఉండే చిన్న గదిలో ఉంటున్నప్పటికీ అతను ఎంతో సంతోషంగా ఉండేవాడు, చెప్పులు కుడుతున్నంత సేపూ ఏదో ఒక పాట పాడుతూ ఉండేవాడు.




అదే ఇంటి లోని పై భాగంలో ఒక ధనవంతుడు ఉంటున్నాడు. అతని గదులు విశాలంగా, వెలుతురుతో నిండి ఉండేవి. అతను చాలా మంచి బట్టలు వేసుకునేవాడు. తినటానికి మంచి మంచి పదార్థాలు ఉండేవి. అయినా అతను సంతోషంగా ఉండేవాడు కాదు.



ఆ ధనవంతుడు రాత్రి అంతా మంచం మీద పడుకుని ఇంకా డబ్బులు ఎలా సంపాదించాలి, దొంగలు తన డబ్బులు కాజెయ్యకుండా ఎలా జాగ్రత్త పడాలి అని తన సంపద గురించే ఆలోచిస్తూ ఉండేవాడు. నిద్ర పట్టబోతుండగా సాధారణంగా తెల్లవారిపోయి సూర్యుని కిరణాలు కిటికీ మీద పడుతుండేవి.

తెల్లవారటంతోనే చెప్పులు కుట్టే వ్యక్తి లేచి తన పనిలోకి దిగేవాడు. పని చేసుకుంటూ ఏదో ఒక పాట పాడుకుంటూ ఉండేవాడు. అతని పాటల వల్ల పైన ఉన్న ధనవంతుడికి నిద్ర పట్టేది కాదు.

'నా పరిస్థితి చాలా సంకటంగా ఉంది!' ధనవంతుడు అనుకున్నాడు. 'డబ్బు గురించి ఆలోచనలతో నాకు రాత్రి నిద్ర పట్టదు. చెప్పులు కుట్టే వ్యక్తి పాటల వల్ల పగటి పూట నిద్రపోటానికి కుదరటం లేదు.'




ధనవంతుడు ఆలోచించసాగాడు.

‘చెప్పులు కుట్టే వ్యక్తి కూడా ఆందోళన పడే విషయం ఉంటే అతను పాటలు పాడడు. ఏ కారణం వల్ల మనుషులు ఎక్కువ ఆందోళనకు లోనవుతారు,’ అని ధనవంతుడు అనుకోసాగాడు.

‘ఆందోళన కలిగించటానికి డబ్బులకు మించి ఏదీ లేదు! డబ్బు లేనప్పుడు కొంతమంది బాధపడతారు. చెప్పులు కుట్టే వ్యక్తి దగ్గర డబ్బులు లేవన్నది నిజమే. కానీ, ఇందుకు అతడు బాధపడటం లేదు. నిజానికి అతడు చాలా సంతోషంగా ఉన్నాడు.

‘ఎక్కువ డబ్బులు ఉన్నప్పుడు కొంతమంది ఆందోళన పడతారు. నా సమస్య కూడా అదే కదా. చెప్పులు కుట్టే వ్యక్తి దగ్గర కూడా ఎక్కువ డబ్బులు ఉంటే అతడు కూడా ఆందోళనకు లోనవుతాడా? నాకు ఒక ఉపాయం తట్టింది! అలా చేసి, ఏమవుతుందో చూస్తాను!’




కొన్ని నిమిషాల తరవాత చెప్పులు కుట్టే వ్యక్తి ఇంటికి ధనవంతుడు వెళ్లాడు. తన ఇంటికి వచ్చిన ధనవంతుడిని చూసి చెప్పులు కుట్టే వ్యక్తి ఆశ్చర్యపోయాడు. "మీ కోసం నేను ఏం చెయ్యగలను?" చెప్పులు కుట్టే వ్యక్తి అడిగాడు.

"నీ కోసం ఒక బహుమతి తెచ్చాను," అంటూ చెప్పులు కుట్టే వ్యక్తికి ధనవంతుడు ఒక సంచి ఇచ్చాడు. సంచి తీసి చూసిన చెప్పులు కుట్టే వ్యక్తికి అందులో బంగారు నాణాలు కనిపించాయి.

"ఈ డబ్బులు నేను తీసుకోలేను!" అతను అన్నాడు. "నేను వీటిని సంపాదించలేదు. వీటిని తీసుకుని వెళ్లిపోండి."

"నీ పాటలతో ఈ డబ్బుని సంపాదించావు. నేను చూసిన వాళ్లందరి లోకి నువ్వే సంతోషంగా ఉన్నావు, అందుకే నీకు ఈ డబ్బులు ఇస్తున్నాను," అన్నాడు ధనవంతుడు.




చెప్పులు కుట్టే వ్యక్తి సమాధానం కోసం చూడకుండా ధనవంతుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

బంగారు నాణాలను బల్ల మీద పోసి చెప్పులు కుట్టే వ్యక్తి వాటిని లెక్క పెట్టసాగాడు. యాభై రెండు నాణాలు లెక్కపెట్టిన తరవాత అటుగా వెళుతున్న ఒక వ్యక్తి కిటికీ లోంచి కనిపించాడు. వెంటనే నాణాలను సంచిలో పెట్టేశాడు. తరవాత డబ్బులు లెక్క పెట్టటాన్ని ఎవరూ చూడకుండా పడుకునే గది లోపలికి వెళ్లాడు.




బంగారు నాణాలను మంచం మీద పోశాడు. అవి ఎంత బాగున్నాయి! ఎంత మెరిసిపోతున్నాయి! ఇంత డబ్బులను అతను ఇప్పటివరకు చూడలేదు. గదిలోని ప్రతి వస్తువూ బంగారంలా మెరుస్తూ కనపడేవరకు అతను ఆ బంగారు నాణాలనే చూస్తూ ఉండిపోయాడు. తరవాత వాటిని మెల్లగా లెక్క పెట్టటం మొదలు పెట్టాడు.

'వంద బంగారు నాణాలు! ఇప్పుడు నేను ధనవంతుడిని! వీటిని ఎక్కడ దాచిపెట్టాలి?'



తాను పని చేసుకుంటూ కూడా చూస్తూ ఉండొచ్చని అతను ముందు డబ్బుల సంచిని మంచం కాళ్ల వైపు దుప్పటి కింద దాచిపెట్టాడు.


‘దుప్పటి కింద డబ్బుల మూట ఎత్తుగా కనపడుతోంది,’ అతడు తనలో తాను అనుకున్నాడు. ‘ఎవరైనా చూస్తే దానిని దొంగిలిస్తారు. దానిని తల వైపున దాచిపెడతాను.’



బంగారం సంచిని తలవైపున దాచి పెడుతున్నప్పుడు అతని భార్య గదిలోకి వచ్చింది.

"అక్కడ ఏం చేస్తున్నావు?" అతనిని అడిగింది.

భార్య వైపు చెప్పులు కుట్టే వ్యక్తి కోపంగా చూశాడు, బయటకు వెళ్లమని గట్టిగా అరిచాడు. అతను జీవితంలో మొదటిసారి భార్యతో అంత కఠినంగా మాట్లాడాడు.




మధ్యాహ్నం భోజనాలకు అందరూ కూర్చున్నారు. కానీ, తన డబ్బులు ఎవరైనా ఎత్తుకుని పోతారన్న భయంతో చెప్పులు కుట్టే వ్యక్తి ఏమీ తినలేకపోయాడు. పని చేస్తున్నప్పుడు కూడా అతడు పాటలు ఏమీ పాడటం లేదు. సాయంత్రం అయ్యేసరికి అతని పరస్థితి మరీ దిగజారింది. భార్యతో అతను ప్రేమగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు.



రోజులు గడుస్తున్న కొద్దీ చెప్పులు కుట్టే వ్యక్తిలో ఆందోళన పెరగసాగింది. అతను విచారంగా ఉంటున్నాడు. నిద్రపోతే లేచేటప్పటికి డబ్బులు మాయం అవుతాయేమోనన్న భయంతో అతనికి రాత్రుళ్లు నిద్ర పట్టటం లేదు. దాంతో అతను రాత్రంతా మంచం మీద అటూ ఇటూ దొర్లుతూ ఉంటాడు.

అయితే, పైన ఉంటున్న ధనవంతుడు చాలా సంతోషంగా ఉన్నాడు. 'నాకు నిజంగా మంచి ఆలోచన వచ్చింది,' తనలో తాను నవ్వుకున్నాడు. 'ఇప్పుడు చెప్పులు కుట్టే వ్యక్తి పాటలు నన్ను ఇబ్బంది పెట్టటం లేదు. పగలు హాయిగా నిద్ర పోతున్నాను,' అనుకున్నాడు.




వంద బంగారు నాణాల గురించి చెప్పులు కుట్టే వ్యక్తి అనేక నెలలు ఆందోళన పడ్డాడు. అతను బక్కచిక్కి పోయాడు. అతడిలో ఉత్సాహమే లేదు. అతని భార్యా, పిల్లలు కూడా సంతోషంగా లేరు. ఇక ఆ బాధని భరించలేక అతని భార్య ఒక రోజు అతనితో తన మనసులోని మాట చెప్పింది.

"ఆ బంగారు నాణాలు తిరిగి అతనికి ఇచ్చేసెయ్. నీ సంతోషం, నీ పాటల కంటే ప్రపంచంలో ఉన్న బంగారం అంతా కలిపినా విలువ చెయ్యదు," అని ఆమె చెప్పింది.



భార్య మాటలు విన్న చెప్పులు కుట్టే వ్యక్తి ఎంతో ఊరట పొందాడు! బంగారు నాణాలు ఉన్న సంచిని తీసుకుని పరిగెత్తుకుంటూ పైన ఉన్న ధనవంతుని దగ్గరకు వెళ్లాడు. సంచిని అతని బల్ల మీద వేసి, నవ్వుతూ, "మీ బంగారు నాణాల సంచిని మీరే తీసుకోండి! నేను డబ్బు లేకుండా ఉండగలను, కానీ నా పాటలు లేకుండా ఉండలేను," అన్నాడు.



అయిపోయింది